క్లుప్తంగా

సీఎం జగన్‌కు వినతిపత్రం



సీఎం వైఎస్ జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు నందన

మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శనివారం ఎన్నికల ప్రచార సభలో పాల్గొనడానికి హిందూపురానికి వచ్చారు. ఈ సందర్భంగా మడకశిర ఎన్నికల మహిళా ప్రచార కమిటీ ఇన్‌చార్జ్ వైజీ నందన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిశారు. మడకశిర నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై సీఎంకు వినతి పత్రం అందించారు. మడకశిర ప్రాంతంలోని చెరువులకు కృష్ణా జలాలు అందించడం తదితర అంశాలను ఆమె సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మడకశిర ప్రాంతంలోని సమస్యలను పరిష్కరించడానికి సీఎం జగన్ హామీ ఇచ్చినట్లు నందన తెలిపారు.

పీఓ, ఏపీఓలకు శిక్షణ

మడకశిర: పట్టణంలోని వ్యవసాయశాఖకు చెందిన గోదాములో శనివారం పీఓ, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌ఓ గౌరిశంకర్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 13న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా 237 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో పీఓ, ఏపీఓలు ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారు. వారికి ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లో విధులను ఎలా నిర్వర్తించాలో వివరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ గౌరీశంకర్‌రావు మాట్లాడుతూ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా ఈసీ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓ వెంకటేష్, డీటీలు మారుతీప్రసాద్, బాలాంజనేయులు, ట్రైనర్లు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు



అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ, అష్టోత్తర, విష్ణుసహస్ర నామాలు, కుంకుమార్చన, అభిషేకం ఇతరాత్ర పూజలు చేశారు. అనంతరం స్వామివారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహాన్ని పంచలోహ కవచాలను అమర్చారు. అనంతరం భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టువస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరించి మహా మంగళారతి ఇచ్చారు. స్వామిని కొలిచే పట్టణ, చుట్టు పక్కల ఉన్న గ్రామాల ప్రజలతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆప్షన్ ఫారాలు తీసుకోండి

రొళ్ల: స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలను కళాశాలగా మారుస్తూ (అప్‌గ్రేడ్) చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం అందరికి తెలిసిందేనని ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల నుంచి హెచ్‌ఎంలు ఆప్షన్ ఫారాలు విరివిగా తీసుకోవాలన్నారు. 2024–25 విద్యా సంవత్సరం జూన్ నెల నుంచి రొళ్ల కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో చదవడానికి తరగతులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రూపునకు 40 సీట్లు చొప్పున కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు నిర్లక్ష్యం చేయకుండా కళాశాలలో విద్యార్థులు చేరే విధంగా ఆప్షన్ ఫారాలు వారి నుంచి తీసుకోవాలని కోరారు.

కంటి చుక్కల వైద్యానికి స్పందన



శిబిరానికి తరలి వచ్చిన జనం

పావగడ: స్థానిక రోటరీ క్లబ్ ఆవరణలో శనివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద కంటి చుక్కల వైద్యానికి సుమారు 4 వేల మంది జనం తరలి వచ్చారు. ఆయుర్వేదంతో తయారు చేసిన సిద్ధ కంటి చుక్కల వైద్యం నుంచి కళ్లకు ఎలాంటి ప్రమాదం ఉండదని ఆయుర్వేద వైద్యుడు భద్రావతి మోక్షానంద తెలిపారు. తమిళనాడులోని వంశ పారంపర్య సిద్ధ వైద్యుడు కే ముత్తు కృష్ణన్ తయారు చేసిన సిద్ధ కంటి చుక్కల వైద్యంతో సాధారణ కంటి జబ్బులు నయ మవుతాయన్నారు. రోటరి క్లబ్ అధ్యక్షుడు సత్యలోకేశ్ మాట్లాడుతూ గత నెల 4 న వచ్చిన జనం కంటే ఈసారి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చారన్నారు. ప్రతి నెలా 4న కంటి చుక్కల వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు.



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మార్మోగిన జగన్నినాదం

జై జగన్.. జయహో జగన్...
జై వైఎస్సార్‌సీపీ.. జైజై వైఎస్సార్‌సీపీ నినాదాలతో హిందూపురం పట్టణం దద్దరిల్లింది. శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రచార సభ నేపథ్యంలో ఉదయం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఎటు చూసినా వైఎస్సార్‌సీపీ జెండాలు, ర్యాలీలు, జగన్ పాటలతో హోరెత్తించారు. యువత, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పట్టణం కిటకిటలాడింది.

– సాక్షిబృందం:



వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



జై జగన్ నినాదాలు చేస్తున్న మహిళలు



వైఎస్సార్‌సీపీ జెండాతో సందడి



సీఎం జగన్‌ను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న యువకుడు



జగన్‌ను చూసేందుకు, ఫొటోలు తీసుకునేందుకు బారులు తీరిన జనం



సీఎం జగన్ సభకు తరలివస్తున్న జనం



వైఎస్సార్‌సీపీ జెండా, బ్యాండు మేళాలతో వస్తున్న యువకులు



అంబేడ్కర్ సర్కిల్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

దారులన్నీ ‘పురం’ వైపే...

గుడిబండ: హిందూపురం అంబేడ్కర్ సర్కిల్‌లో శనివారం నిర్వహించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభకు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు.

అమరాపురం: హిందూపురంలో నిర్వహించిన సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభకు అమరాపురం మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లాయి. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కాంతరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీలు కృష్ణమూర్తి, లలితమ్మ తదితరులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

చిలమత్తూరు: మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దాదాపు 100 పైగా బస్సుల్లో హిందూపురంలో నిర్వహించిన సీఎం జగన్ సభకు తరలివెళ్లారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా మహిళలు సైతం పెద్ద సంఖ్యలో వెళ్లారు.

మడకశిరరూరల్: హిందూపురంలో శనివారం జరిగిన సీఎం జగన్ ప్రచార సభకు మడకశిర మండలంలోని వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తరలివెళ్లారు. జగనన్న సంక్షేమ పాలన మళ్లీ కావాలని తాము సీఎం సభకు ఆనందోత్సవాలతో తరలి వెళ్తున్నట్లు చెప్పారు.

మడకశిర: హిందూపురంలో శనివారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సభలో మడకశిర ప్రాంతానికి చెందిన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నియోజకవర్గంలోని 66 గ్రామ పంచాయతీల నుంచి వేలాది మంది సభలో పాల్గొన్నారు. మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, వాగేష్, బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు, అసెంబ్లీ ఇన్‌చార్జ్ అనంతరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రచార కార్యక్రమంలో భాగంగా హిందూపురంలో శనివారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండల వ్యాప్తంగా 60కి పైగా కార్లు, బస్సులు, 200కు పైగా ద్విచక్ర వాహనాల్లో వెళ్లారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల వ్యాప్తంగా పది పంచాయతీల నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం హిందూపురంలో నిర్వహించిన సీఎం సభకు తరలి వెళ్లారు. తాలూకా ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజుతో కలిసి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ప్రచార సభకు వెళ్లారు.

అగళి: మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పిలుపుమేరకు హిందూపురంలో నిర్వహించిన సీఎం జగన్ సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.



గుడిబండ నుంచి తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు



జమ్మానిపల్లి నుంచి జెడ్పీటీసీ సభ్యురాలు సరోజమ్మ ఆధ్వర్యంలో తరలివెళ్తున్న నాయకులు



అమరాపురం మండలం కె.శివరం నుంచి తరలి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మడకశిర నుంచి తరలి వెళుతున్న పార్టీ శ్రేణులు



లేపాక్షి నుంచి సీఎం సభకు వెళ్తున్న నాయకులు



అగళి మండలం ఆలూడి నుంచి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రొళ్ల: ప్రచార సభకు నాయకులతో కలిసి వెళ్తున్న ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు

మీ ఆదరాభిమానాలకు వందనం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దీపిక, ఈరలక్కప్ప, శాంతమ్మ



హిందూపురం: పట్టణంలో శనివారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రచార సభను విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ టీఎన్ దీపిక తెలియజేశారు. జగనన్నపై ఇంతటి ప్రేమాభిమానాలతో పెద్ద ఎత్తున మహిళామణులు, సోదరులు, అవ్వతాతలు, యువకులు తరలిరావడం హర్షణీయమన్నారు. ప్రజల అపారమైన ప్రేమాభిమానుల ముందు ఎండ సైతం చిన్నబోయిందన్నారు. జనసందోహం, కేరింతలు, జయధ్వనులతో హిందూపురం దద్దరిల్లిందన్నారు. మీ ఆదర అభిమానికి వందనాలన్నారు. హిందూపురం కనివిని ఎరగని రీతిలో జనంతరలివచ్చి సభను విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ప్రతి ఒక్కరికి రుణపడిఉంటామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పార్టీనాయకులు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, సర్పంచులు, ఎమ్పీటీసీ, జెడ్పీటీసీలు, డైరెక్టర్లు, మైనార్టీనాయకులు,సింగిల్‌విండో,మార్కెట్‌యార్డు, పార్టీ నాయకులు, పార్టీ జేసీఎస్ కన్వీనర్లు, కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

మడకశిర: హిందూపురంలో జరిగిన వైఎస్ జగన్ సభను విజయవంతం చేసినందుకు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలందరికీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే మడకశిరలో భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయంగా కనిపిస్తోందన్నారు.

సీఎం జగన్‌ను కలసిన నాయకులు



సీఎం జగన్‌ను కలసిన ఇంద్రజ, అబ్దుల్‌ఘనీ, మధుమతిరెడ్డి

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఉదయం మొదట హిందూపురం ఎంజీఎం గ్రౌండ్‌కు చేరుకున్నారు. హెలీప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి జగన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, నియోజకవర్గ నాయకురాలు మధుమతి రెడ్డి కలిశారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి ‘పురం’లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేయాలని సీఎం జగన్ సూచించినట్లు వారు తెలిపారు.



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న అన్సుక్‌కుమార్

శిక్షణ కార్యక్రమం పరిశీలన

మడకశిర: పట్టణంలోని వ్యవసాయ గోదాములో శనివారం నిర్వహించిన పీఓ, ఏపీఓల శిక్షణ కార్యక్రమాన్ని సాధారణ ఎన్నికల పరిశీలకుడు అన్సుక్‌కుమార్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. నిబంధనలమేరకు ఎన్నికల విధులను నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌ఓ గౌరీశంకర్‌రావు ఉన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం

మడకశిర: పట్టణంలోని 16 వార్డులో ఆదివారం ఉదయం 8 గంటలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప తెలిపారు. కౌన్సిలర్లు, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల సభ్యులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నమో వేంకటేశా...

హిందూపురం: స్థానిక పేట వేంకటరమణస్వామి దేవస్థానంలో శనివారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని కోదండరామస్వామి రూపంలో విశేషంగా అలంకరించారు. మహా మంగళ హారతిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు పొంగళి నైవేద్యాన్ని పంపిణీ చేశారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత పేట వేంకటరమణస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చి మంగళవాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ గౌరవధ్యక్షుడు భగీరథ నవీన్ , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శనేశ్వరాలయంలో...

పట్టణంలోని డీబీ కాలనీలో శనేశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్ శనేశ్వరుడికి తిలతైలాభిషేకం నిర్వహించారు. అలాగే జేష్టాదేవి సమేత శనిదేవుడి ఉత్సవమూర్తులను అలంకరించి ప్రాకారోత్సవం నిర్వహించారు. వందలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



అలంకరణలో వేంకటేశ్వరస్వామి

గంగమ్మదేవికి పూజలు

పావగడ: స్థానిక నల్లరాళ్ల గంగమ్మదేవి జాతరోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.